క్లుప్తంగా

ఫౌండేషన్ సేవలు అభినందనీయం


విద్యార్థులతో ఎస్సై సుమాంజలి, నాయకులు

కుంటాల : ప్రభుత్వ బడులకు గ్రామీణ సపోర్టు, స్ఫూర్తి ఫౌండేషన్ల సేవలు అభినందనీయమని ఎస్సై పోగుల సుమాంజలి పేర్కొన్నారు. గ్రామీణ సపోర్టు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో 82 మంది విద్యార్థులతో పాటు ఆరుగురు వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ బోజాబాయి, హెచ్ఎం ఎల్లన్న, కార్యదర్శి సారిక, ఉపసర్పంచ్ కిష్టయ్య, దిగంబర్‌పటేల్, శ్యాంరావు పాల్గొన్నారు.

'రాబోయేది బీజేపీ ప్రభుత్వమే'


సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎంపీ

కడెం: వచ్చే ఎన్నికల్లో అధిక సీట్లు సాధించి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మంగళవారం ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతు ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, రవిగౌడ్, మోహన్‌నాయక్, సత్తెన్న, మల్లేశ్, రమేశ్, ధీరజ్, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో మంగళవారం గంగపుత్ర ఐక్యతా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో గంగపుత్రులకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పల్లికొండ ప్రవీన్, యూత్ అధ్యక్షుడు రవి, కుత్తాల గంగరాజం, మనోజ్, ముద్యం, మోహన్, తదితరులు ఉన్నారు.

వ్యక్తికి గాయాలు


గాయపడ్డ అశ్విన్ జాదవ్


సారంగపూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు కిన్వట్ మండల కేంద్రానికి చెందిన అశ్విన్ జాదవ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. అశ్విన్ జాదవ్ తన బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌పై తన స్వగ్రామం వెళ్తుండగా సారంగపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా టిప్పర్ వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఆయన కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : వీరసింహారెడ్డి
నారాయణ : వారసుడు
వెంకటేష్ : వాల్తేరు వీరయ్య

వడివడిగా 'ఎత్తిపోతలు'

- హర్షం వ్యక్తం చేస్తున్న ఆరు గ్రామాల రైతులు
- సాగులోకి రానున్న 4,800 ఎకరాలు
- ఖరీఫ్ నాటికి నీటిని అందిస్తామంటున్న అధికారులు


పిప్రి గోదావరి వద్ద ఎత్తిపోతల పథకం పనులు పరిశీలిస్తున్న అధికారులు


రాయపూర్‌కాండ్లీ శివారులో జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామంలో గోదావరి నదిపై చేపట్టిన ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే సమీపంలోని ఆరు గ్రామాలైన పిప్రి, నగర్, రాయపూర్‌కాండ్లీ, నగర్‌తండా, మొహాళ, లోకేశ్వరం గ్రామాల్లోని 1500 మంది రైతులకు చెందిన 4800 ఎకరాలకు సాగు నీరు అందనుంది. ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డి గెలిచి టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరాక ఈ ఎత్తిపోతల పథకం పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకున్నారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో భైంసాకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు పిప్రి ఎత్తిపోతల గురించి వివరించగా.. వెంటనే కేసీఆర్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించండి. తప్పకుండా ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారు.

రూ.58.95 కోట్లతో పనులు

2021 ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో మంత్రి హరీశ్‌రావు పిప్రి గ్రామ సమీపంలోని గోదావరి నదిపై ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు రూ.58 కోట్ల 95 లక్షల నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎత్తిపోతల్లో భాగంగా రెండు ప్రధాన కుండీలు(రాయ్‌పూర్‌కాండ్లీ-1, మొహాళ-2), 24 డీసీ(డెలివరీ ఛానెల్)లను నిర్మిస్తున్నారు. ప్రిప్రి గ్రామం నుంచి రాయ్‌పూర్‌కాండ్లీ, మొహాళ గ్రామాలకు సాగునీరు ఎత్తిపోసేందుకు వేర్వేరుగా పైపులైన్లు ఏర్పాటు చేశారు. రాయ్‌పూర్ కాండ్లీ శివారు నుంచి లోకేశ్వరం శివారు వరకు మరో పైపులైన్ నిర్మించనున్నారు. మొహాళ నుంచి నగర్ తండా, నగర్, ప్రిప్రి గ్రామాలకు సాగునీటి అందిస్తామని అధికారులు పేర్కొన్నారు.

పూర్తయిన కుండీల నిర్మాణం..

పిప్రి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే మొహాళ, రాయపూర్ కాండ్లీ గ్రామ సమీపంలో మెయిన్ కుండీలను పూర్తి చేశారు. వివిధ గ్రామాలకు వెళ్లే పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే అరవైశాతం పనులు పూర్తయ్యాయని.. దగ్గరుండి పర్యవేక్షిస్తున్నామని వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసి సాగు నీరు అందిస్తామని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.


మొహాళ వద్ద పూర్తయిన కుండీ

వచ్చే ఖరీఫ్‌కు నీరందిస్తాం

పిప్రి ఎత్తిపోతల పథకం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. వచ్చే ఖరీఫ్‌కు పిప్రి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తాం.

– అనిల్, ఇరిగేషన్ డీఈ, నిర్మల్

సస్యశ్యామలంగా భూములు



గ్రామంలోని వ్యవసాయ భూములకు సాగునీరు లేక ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం విలువైన భూములిస్తే మాకు ఇప్పుడు ఫలితం దక్కనుంది. ఇది పూర్తయితే చుట్టు పక్కల గ్రామాల రైతుల కష్టాలు దూరం అవుతాయి.

– రాంరెడ్డి, రాయపూర్‌కాండ్లీ

త్వరగా పూర్తి చేయాలి



పిప్రి ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేసి ఖరీఫ్ పంటలకు నీరందించాలి. దీంతో ఆయా గ్రామాల్లో బీడుభూములు సాగులోకి వస్తాయి. గుట్ట మీద ఉన్న భూమలకు నీరందిస్తే మాకు ఇబ్బందులుండవు.

– నక్కుబాయి, నగర్‌తండా

అటెన్షన్ ప్లీజ్.. నీటి సౌకర్యం కల్పించరూ



తానూరు: మండలంలోని మహలింగి గ్రామంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటి తొట్టి నిరుపయోగంగా మారింది. దీంతో కొందరు ఈ తొట్టిని పెంట కుప్పలు వేసేందుకు వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి తొట్టికి నీటి సౌకర్యం అందించి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మోహన్‌సింగ్, ఎంపీవో, ఫోన్: 98666 51826

ఆలయ వార్షికోత్సవం ప్రారంభం


ప్రారంభ వేడుకలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివసాయి సమాజ్ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రామ్మృష్ణశర్మ, శశిదర్శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీసాయి సచ్చరిత్ర, గురుచరిత్ర పారాయణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలకు సీఐ అజయ్‌బాబు, కమిషనర్ రత్నాకర్‌రావు, వీడీసీ నాయకులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అంకం రాజేందర్, కొక్కుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


పారాయణంలో పాల్గొన్న భక్తులు


చీరలే శ్రీరామరక్ష

జిల్లాలో వరినారును కోతులు, అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సోన్ మండలం కడ్తాల్ గ్రామ శివారులో వరినారుకు రక్షణగా చుట్టూ చీరలు కట్టిన దృశ్యమిది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

'కంటివెలుగు' ఏర్పాట్ల పరిశీలన

లోకేశ్వరం: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని బాగాపూర్ గ్రామంలో కంటివెలుగు ఏర్పాట్లను తహసీల్దార్ పరిశీలించి మాట్లాడారు. శిబిరానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సల్మాన్‌రాజ్, వైద్యాధికారి తేజస్వీ, సందీప్, సర్పంచ్ గంగాధర్, కార్యదర్శి రఘుచరణ్ ఉన్నారు.

లక్ష్మణచాంద: కంటివెలుగులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యూవెల్మల్ సర్పంచ్ అంకం గంగామణి కోరారు. మంగళవారం సోన్ మండలంలోని న్యూవెల్మల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ఇళ్ల వద్దకు వెళ్లి శిబిరంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషారాణి, ఉపసర్పంచ్ స్వామి, ఎంపీటీసీ నాగయ్య, శ్రీనివాస్, నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


బాగాపూర్‌లో పరిశీలిస్తున్న తహసీల్దార్ సరిత

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద మండలంలో రేపటి నుంచి కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం అవుతుందని లక్ష్మణచాంద పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్ తెలిపారు. లక్ష్మణచాందలో వచ్చే నెల 15వరకు, చామన్‌పెల్లిలో ఫిబ్రవరి 16 నుంచి 24 వరకు, చింతల్‌చాందలో ఫిబ్రవరి 27 నుంచి మార్చి ఆరో తేదీ వరకు, మునిపెల్లిలో మార్చి 8 నుంచి 15 వరకు, మల్లాపూర్‌లో మార్చి 16 నుంచి 28 వరకు, పార్‌పెల్లిలో మార్చి 29 నుంచి ఏప్రిల్ 18వరకు, ధర్మారంలో ఏప్రిల్ 19నుంచి 24 వరకు, పీచరలో ఏప్రిల్ 25నుంచి మే 5 వరకు, తిర్పెల్లిలో మే 8 నుంచి 10 వరకు కంటివెలుగు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


న్యూవెల్మల్‌లో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

రెండో ఏఎన్ఎంలకు అలవెన్సులు ఇవ్వాలి

నిర్మల్‌టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలకు అదనపు అలవెన్సులు ఇవ్వాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమోహన్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా రెండో ఏఎన్ఎంల దీర్ఘకాల సమస్యలపై నిర్మల్‌లో జిల్లా వైద్యాధికారి ధనరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో రెండవ ఏఎన్ఎంలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. 16ఏళ్లుగా పనిచేస్తున్నా రెగ్యులర్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కంటి వెలుగు ప్రారంభించే ఖమ్మం సభలో మంచి వార్త చెప్పాలని కోరారు. ఆ సంఘం జిల్లా కోశాధికారి వేణుగోపాలరావు, భోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, సరస్వతి పాల్గొన్నారు.


వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో ఈనెల 31న కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్, బాబాపూర్, బోరిగాం, న్యూకంజర్, కనకాపూర్, చింతల్‌చాంద, చామన్‌పెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. మొదటి నుంచి తన వెన్నంటి ఉన్న ప్రతీ కార్యకర్తను కలిశారు. అండగా ఉంటానని, ఎవరూ ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని ప్రతీ గ్రామం నుంచి ప్రతీ కార్యకర్త తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఇటీవల కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులై తొలిసారిగా మండలానికి వచ్చిన ముత్యంరెడ్డిని నర్సాపూర్ సర్పంచ్ లలిత-జీవన్‌రెడ్డి దంపతులు సన్మానించారు. డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, నర్సాపూర్ సర్పంచ్ లలిత, నాయకులు గంగారెడ్డి, జీవన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


న్యూ కంజర్‌లో నాయకులతో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఆఖరు మజిలీకి అవస్థలు


మునిపెల్లిలో కూలిపోయిన వైకుంఠధామం

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వైకుంఠధామాలు
- గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

లక్ష్మణచాంద: గతంలో మండలంలో కురిసిన భారీవర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో పరివాహక ప్రాంతాలు నీట మునిగిన విషయం తెలిసిందే. పార్‌పెల్లి, మునిపెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లోని వైకుంఠధామాలు కూలిపోయాయి. ఉపాధిహామీ పథకంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామాలు ఐదు నెలల కిందట వర్షాలకు దెబ్బతిన్నాయి. గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కూలిన స్నానాల గది

బియ్యం పంపిణీ చేయాలి

పెంబి: మండలంలోని పసుపులలో రేషన్ డీలర్ సస్పెండ్ కావడంతో అక్కడి గ్రామస్తులతోపాటు కోలాంగూడ గిరిజనులకు రేషన్ బియ్యం పంపిణీ చేయకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మంజులకు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బియ్యం లేక ప్రజలు సంక్రాంతి పండుగ జరుపుకోని దుస్థితి నెలకొందన్నారు. వెంటనే తమకు రేషన్‌బియ్యం పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరారు. తిరుపతి, శ్రీనివాస్, భీంరావు, శేషురావు, పసుపుల, కొలంగూడ గ్రామాల ప్రజలు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో పండుగ వేళ ప్రారంభించిన నర్సాపూర్ ప్రీమియర్ లీగ్-6 (ఎన్పీఎల్) క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ఎలెవన్ స్టార్ జట్టుకు రూ.12500, ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆదర్శ యూత్ జట్టుకు రూ.7500, ట్రోఫీలను సర్పంచ్ రాంరెడ్డి అందజేశారు. జట్లకు నగదును పంచాయతీ తరఫున అందించగా..ట్రోఫీలకు శుభం వెడ్డింగ్ ఫిలిమ్స్, నెరోలాక్ పెయింట్ సునీల్ దాతలుగా ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు చేపట్టిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో మండలంలోని సుర్జాపూర్ పంచాయతీ పరిధిలోని బుడగజంగం గ్రామం వద్ద నిర్వహించగా మంగళవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చింతల్‌పేట్‌కు ప్రథమ బహుమతి రూ.రెండు వేలు, బాదన్‌కుర్తికి ద్వితీయ బహుమతి రూ.వెయ్యి, మ్యాన్ ఆఫ్ ద సిరిస్ కింద మరో రూ.500 అందజేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తోకల బుచ్చన్న, కమలాకర్, లింబాద్రి, రమేశ్, రవి, నర్సయ్య, రాజేశ్వర్, నవీన్‌గౌడ్, శేఖర్, శ్రీను, రవి, భీమరాజు తదితరులు ఉన్నారు.

ముగిసిన వేలం

కడెం: మండలంలోని అక్కకొండ లక్ష్మీనరసింహ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం వేలం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జగ్గారావు తెలిపారు. కొబ్బరికాయలు, బెల్లం విక్రయించేందుకు రూ.48500,లడ్డూ, పులిహోర విక్రయం కోసం రూ.28,500, వాహనాల పార్కింగ్ కోసం రూ.15,500 ఆదాయం వచ్చిందన్నారు. రమేశ్, సర్పంచ్ రాజిరెడ్డి, గంగన్న, స్టీఫెన్ ఉన్నారు.

సన్మానం

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు అనురత్ గార్కె తనయుడు రాహుల్ నిర్మల్ ఏరియాస్పత్రిలో వైద్యుడిగా నియమితులవగా.. భీంరావు డోంగ్రె కూతురు శీతల్ మంచిర్యాల కోర్టులో ఉద్యోగం సాధించారు. మంగళవారం ప్రజ్ఞా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మాజీ చందనే, యూనియన్ జిల్లా అధ్యక్షుడు భీంరావ్ వాగ్మారే, సురేశ్, సూర్యదాస్ తదితరులు ఉన్నారు.